

అక్రమ రవాణాను అడ్డుకుంటాం

ఆంధ్రా ప్రాంతం నుంచి ధాన్యం అక్రమ రవాణా జరుగకుండా చూస్తామని సీఐ చరమందరాజు తెలిపారు. - 10లో



సంపూర్ణ మద్దతు

పాకిస్తాన్ ఉగ్రవాద స్థావరాలపై చేస్తున్న దాడులకు మద్దతు తెలుపుతున్నానని ఎంపీ రఘువీర్‌రెడ్డి అన్నారు. - 10లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 40°/27°

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కేంద్ర పథకాలకు గుర్తింపు కార్డు ముఖ్యం

అర్వపల్లి: కేంద్ర ప్రభుత్వ పథకాలకు గుర్తింపు కార్డే ముఖ్యమని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కుంచమర్తి గ్రామంలో బుధవారం రైతు గుర్తింపు కార్డు రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. భూమి ఉన్న ప్రతి ఒక్కరూ రైతు గుర్తింపు కార్డుకు భూమి వివరాలతో నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ గణేష్, ఏఈఓ నేరెళ్ల సత్యం, రైతులు ఉగ్గం లింగరాజు, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



వట్టిఖమ్మంపహాడ్‌లో ధాన్యం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

చివ్వెంల(సూర్యాపేట) : ఐకేపీ, పీఏసీఎస్ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు సూచించారు. బుధవారం చివ్వెంల మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వాల్యతండా, వట్టిఖమ్మంపహాడ్, అక్కలదేవిగూడెం గ్రామాల్లోని ఐకేపీ కేంద్రాలను తనిఖీ చేసి మాట్లాడారు. రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. ఐకేపీ కేంద్రం నిర్వాహకులు 17 శాతం తేమ వచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి మిల్లులకు తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీ వెంకన్న, వీబీకేలు మల్లేశ్వరి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

20న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



అభివాదం చేస్తున్న వామపక్ష నాయకులు

సూర్యాపేట అర్బన్ : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20న చేపట్టే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని వామపక్ష కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. సూర్యాపేటలోని సీపీఎం కార్యాలయంలో సార్వత్రిక సమ్మెపై బుధవారం జిల్లా సన్నాహక సదస్సు నిర్వహించారు. దీనికి ఐఎన్‌టీయూసీ నాయకుడు కాసాని పాపయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాంబాబు, ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు దంతాల రాంబాబు, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు అధ్యక్షత వహించి మాట్లాడారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను అమలు చేసి దేశంలో ఉన్న 50 కోట్ల మంది కార్మికుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యతను మోదీ ప్రభుత్వం విస్మరించడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల శ్రీనివాస్, సీఐటీయూ రాష్ట్ర నాయకుడు ప్రసాద్, ఐఎన్‌టీయూసీ జిల్లా కన్వీనర్ కాసర్ల శ్రీనివాస్, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ నాయకులు శ్యామల అశోక్, ఎస్.రాఘవరెడ్డి, సైదులు, సీఐటీయూ నాయకులు ఎలక సోమయ్య గౌడ్, ముత్యాలు, సైదులు, సాయికుమార్, ఐఎన్‌టీయూసీ నాయకులు ముస్తఫా, శ్రీను, రవి, వెంకట్, ఐ ఎఫ్‌టీ యూ జిల్లా సహాయ కార్యదర్శి దేసోజు మధు, సామ నర్సిరెడ్డి, నాగేల్లి రామనరసయ్య పాల్గొన్నారు.

యాదగిరి క్షేత్రంలో సంప్రదాయ పూజలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో బుధవారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. అర్చకులు సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపారు. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు నిజాభిషేకం, తులసీదళ అర్చనతో కొలిచారు. ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖమండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు. రాత్రి శ్రీస్వామివారికి శయనోత్సవం చేసి ఆలయద్వారబంధనం చేశారు.

● జై జవాన్



ఆపరేషన్ సిందూర్ పేరిట పాకిస్తాన్ ఉగ్రవాదుల స్థావరాలపై దాడులు నిర్వహిస్తున్న భారత సైన్యానికి మద్దతుగా బుధవారం ఆత్మకూర్ (ఎస్)లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు - ఆత్మకూర్ (ఎస్)

● అధ్యయనోత్సవాలకు శ్రీకారం



మఠంపల్లి మండలం మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం అధ్యయనోత్సవాలను ప్రారంభిస్తున్న అర్చకులు - మఠంపల్లి

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

సూర్యాపేట అర్బన్ : ఐకేపీ కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లు నాగార్జున రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐకేపీ కేంద్రాలు ప్రారంభమై రెండు నెలలవుతున్నా నేటికీ పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐకేపీ కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని లిఫ్ట్ చేసేందుకు లారీలు రాకపోవడంతో సమస్య తీవ్రమైందని ఆందోళన వ్యక్తం చేశారు. మిల్లుల వద్దకు తరలించిన ధాన్యాన్ని త్వరగా దిగుమతి చేసుకోవాలని కోరారు.

> కోదాడ పట్టణంలోని ఓ కార్పొరేట్ పాఠశాలలో 2 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాల నిర్వాహకులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద పెద్ద గోదాములో లక్షల రూపాయలు విలువ చేసే పుస్తకాలను ఎలాంటి అనుమతులు లేకుండా విక్రయిస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. వీరు పుస్తకాల కోసం ఒక్కో విద్యార్థి నుంచి రూ.10వేల నుంచి రూ.12 వేల వరకు వసూలు చేస్తున్నారు.

> కోదాడకు చెందిన హరిప్రసాద్ తన్న ఇద్దరు పిల్లలను ఇప్పటి వరకు ప్లే స్కూల్‌లో చదివించాడు. వారిని కార్పొరేట్ పాఠశాలలో ఫస్ట్‌క్లాస్, సెకండ్‌క్లాస్‌లో చేర్పించాలను కున్నాడు. ఫస్ట్‌క్లాస్ విద్యార్థికి ఫీజు రూ.25 వేలు, అడ్మిషన్ ఫీజు రూ.500, పుస్తకాలకు రూ. 5,400, యూనిఫాంకు రూ. 1000, స్టేషనరీకి రూ.1000, స్కూల్ బస్‌ఫీజు రూ. 12,000 కలిపి మొత్తం రూ.44,900 అవుతోంది. సెకండ్‌క్లాస్ విద్యార్థికి రూ. 50 వేల ఫీజు చెల్లించాలని, ఇద్దరికి కలిపి అడ్వాన్స్‌గా రూ.20 వేలు ఇస్తే సీటు రిజర్వు చేస్తామని చెప్పడంతో అవాక్కయ్యాడు.

నర్సరీకి రూ.25వేలు.. టెన్త్‌కు రూ.1.20 లక్షలు

ప్రైవేట్‌లో ఫీజుల మోత

- విద్యా సంవత్సరం ప్రారంభానికి నెల ముందుగానే భారీగా ఫీజులు పెంచిన ప్రైవేట్ స్కూళ్లు
- పిల్లల తల్లిదండ్రుల ఫోన్‌లకు మెసేజ్‌లు
- నిబంధనలు పాటించని నిర్వాహకులు
- పాఠశాలలోనే దుకాణాలు తెరిచి పాఠ్యపుస్తకాలు, స్టేషనరీ అమ్మకాలు



జిల్లాలో ప్రైవేట్ విద్యాసంస్థల వివరాలు

కార్పొరేట్ పాఠశాలలు 12	సాధారణ ప్రైవేట్ పాఠశాలలు 257
మండల, గ్రామస్థాయి ప్రైవేట్ పాఠశాలలు 70	ప్లే స్కూల్స్ 18

కోదాడ: నూతన విద్యాసంవత్సరం ప్రారంభానికి మరో నెల రోజులు ఉండగానే జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలు ఫీజుల మోత మోగిస్తున్నాయి. గత విద్యా సంవత్సరం కంటే ఈ సారి 20 నుంచి 30శాతం ఫీజులను పెంచి తల్లిదండ్రుల ఫోన్‌లకు సమాచారం పంపిస్తున్నాయి. కొత్తగా అడ్మిషన్ తీసుకునే వారు రూ.10వేలు చెల్లించి సీటు రిజర్వు చేసుకోవాలని ఆలస్యమైతే ఫీజు మరింత పెరుగుతుందని బెంబేలెత్తిస్తున్నాయి. నర్సరీకి రూ.25వేలు, 10 తరగతికి రూ.1.20లక్షల ఫీజు ఉంది. వీటికి తోడు కాన్సెప్ట్ పుస్తకాలు, స్టేషనరీ పేరుతో మరో రూ.10వేల నుంచి రూ.12వేల వరకు కట్టాల్సి వస్తుందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బ్యాచ్‌ల పేరుతో రూ.లక్ష నుంచి రూ.1.50లక్షల వరకు

జిల్లాలో ప్రధానంగా సూర్యాపేట, కోదాడ పట్టణాల్లో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలుండగా హుజూర్‌నగర్, తుంగతుర్తి, నేరేడుచర్ల, తిరుమలగిరిలలో ప్రైవేట్ పాఠశాలలున్నాయి. గత విద్యా సంవత్సరం ఉన్న ఫీజుపై ఈ సారి 20–30 శాతం వరకు పెంచేశాయి. కోదాడలాంటి పట్టణంలో కూడా నర్సరీ విద్యార్థులకు రూ. 25 వేల వరకు ఫీజు వసూలు చేస్తుండగా 8 నుంచి 10 వ తరగతి వరకు రూ. లక్ష దాటింది. ఇక కార్పొరేట్ పాఠశాలలు రకరకాల బ్యాచ్‌ల పేరుతో రూ.లక్ష నుంచి రూ.1.50లక్షల వరకు వసూలు చేస్తున్నాయి. హాస్టల్ వసతి ఉంటే అదనంగా వసూలు చేస్తున్నారు.

దుకాణాలు తెరిచారు

ప్రైవేట్ పాఠశాలల్లో దుకాణాలు తెరిచి విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, నోట్‌బుక్స్, స్టేషనరీ అమ్ముతున్నారు. ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు కాకుండా ఇతర ప్రైవేట్ పాఠ్యపుస్తకాలను అంటగడుతున్నారు. 1–5 తరగతుల వరకు ప్రభుత్వ పాఠ్యపుస్తకాలనే ఉపయోగించాలనే నిబంధనను పట్టించుకోవడంలేదు. ప్రైవేట్ పబ్లికేషన్ పుస్తకాలపై 50 శాతానికి పైగా రాయితీ వస్తుండడంతో వీటినే అంటగడుతున్నారు. ఒక్కో పాఠశాల ఒక్కోరకమైన పాఠ్యపుస్తకాలను విక్రయిస్తుండడంతో అవి బహిరంగ మార్కెట్‌లో దొరకడం లేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు తప్పనిసరిగా వారివద్దే, వారు చెప్పిన ధరకే కొనాల్సి వస్తుందని చెబుతున్నారు. వీటి కోసం నర్సరీ నుంచి ఐదు తరగతుల విద్యార్థులకు రూ.5వేల నుంచి రూ.8 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇక ఆరవ తరగతి నుంచి 10 వరకు విద్యార్థులకు ఐఐటీ, నీట్ ఫౌండేషన్ పేరుతో వేల రూపాయల పుస్తకాలను అంటగడుతున్నారు.

నిబంధనలకు పాతర

ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు పాటించడంలేదన్న విమర్శలున్నాయి. ప్రతి పాఠశాలలో ఫీజులతో పాటు పని చేస్తున్న ఉపాధ్యాయుల వివరాలను నోటీస్ బోర్డులో ప్రకటించాలి. తప్పని సరిగా పేరెంట్స్ కమిటీని ఏర్పాటు చేయాలి. ప్రతి భవనానికి ఫైర్ సేఫ్టీ, బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్ ఉండాలి. ప్రభుత్వ పాఠ్యపుస్తకాలనే ఉపయోగించాలి. పాఠశాలలో పుస్తకాలు, స్టేషనరీ విక్రయించకూడదు. ఇలా నిబంధనలున్నా ఒక్కటీ కూడా అమలు కావడం లేదని పలువురు విద్యావేత్తలు అంటున్నారు.

పాఠశాలల్లో దుకాణాలు ఏర్పాటు చేస్తే చర్యలు

అడ్మిషన్ల విషయంలో ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు పాటించాలి.ప్రైవేట్ పాఠశాలల్లో ప్రభుత్వ పాఠ్యపుస్తకాలనే ఉపయోగించాలి. పాఠశాలల్లో దుకాణాలు ఏర్పాటు చేసి నోట్‌బుక్స్, స్టేషనరీ విక్రయించకూడదు. ప్రైవేట్ స్కూళ్లు ముందస్తుగా తరగతులు ప్రారంభించవద్దు.

– సలీంషరీఫ్, మండల విద్యాధికారి, కోదాడ

బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

భానుపురి (సూర్యాపేట) : అధికారులందరూ సమన్వయంతో పనిచేసి జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ తెలిపారు. బుధవారం సూర్యాపేట కలెక్టర్ చాంబర్‌లో అసిస్టెంట్ లేబర్ కమిషనర్ అరుణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎలిమినేషన్ – ఎరాడికేషన్ ఆఫ్ చైల్డ్ అండ్ అడాలసెంట్ లేబర్ డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. బడి ఈడు పిల్లలను పనుల్లో పెట్టుకుంటే యజమానులపై కేసు నమోదు చేయడంతో పాటు జరిమానా వేసి చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే 15 రోజుల్లో తహసీల్దార్‌లు, ఎంపీడీఓలతో మండల స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. ఇటుక బట్టీలు, ఫ్యాక్టరీలు, దుకాణాలలో ఉన్న బాల కార్మికుల్ని గుర్తించాలని, మున్సిపల్ కమిషనర్లు ట్రేడ్ లైసెన్స్, టాక్స్ వసూలు చేసేటప్పుడు దుకాణాలలో బాల కార్మికులను గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ వివి అప్పారావు, డీపీఓ యాదగిరి, డీడబ్ల్యూ ఓ నరసింహారావు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ రమణారావు,డీఎంహెచ్ ఓ కోటాచలం, ఇండస్ట్రీస్ జీఎం సీతారాం నాయక్, వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, మెప్మా పీడీ రేణుక, ఇరిగేషన్, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులు, ఆర్ డబ్ల్యూ ఎస్, టీఎస్ ట్రాన్స్‌కో అధికారులు, సూపరింటెండెంట్ శ్రీనివాసరాజు, కార్మిక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

31మంది ఏఎస్‌ఐల బదిలీ



మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పని చేస్తూ మూడు సంవత్సరాల సర్వీస్‌ను పూర్తి చేసుకున్న 31 మంది ఏఎస్‌ఐలకు బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ నరసింహ కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీ ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కోరుకున్న చోటుకు పోస్టింగ్ ఇచ్చామని, అనుభవాన్ని ఉపయోగించి పోలీసు సేవలు అందించాలన్నారు. స్టేషన్ హౌస్ అధికారికి, జూనియర్స్‌కు, తోటి సిబ్బందికి సలహాలు ఇస్తూ ఆదర్శంగా ఉండాలని సూచించారు. వ్యాయామం, యోగా చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, అడ్మినిస్ట్రేషన్ అధికారి మంజు భార్గవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ నాగబూషణరావు ఉన్నారు.

పౌరులు చట్టానికి లోబడి నడుచుకోవాలి

మునగాల: గ్రామాలలో పౌరులు చట్టాలకు లోబడి నడుచుకోవాలని ఎస్పీ కె.నరసింహ కోరారు. పోలీసు ప్రజాభరోసా కార్యక్రమంలో భాగంగా బుధవారం రాత్రి మునగాల మండలం నరసింహులగూడెంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రజలు క్షణికావేశం, సంతోషం కోసం నేరాలకు పాల్పడి జీవితాలను జైలుపాలు చేసుకోవద్దని సూచించారు. సైబర్ నేరాలు,మోసాలపై అవగాహన కలిగిఉండాలని సూచించారు. విద్యార్థులు, యువతీయువకులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని, గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. గ్రామం నుంచి ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో చదువుకొని ఇంటర్మీడియట్,పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను ఎస్పీ సత్కరించారు. కార్యక్రమంలో మునగాల సీఐ బి.రామకృష్ణారెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ నాగభూషణరావు, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.



హాజరైన ఏఎస్‌ఐలు

మండలాల్లోనూ వేసవి శిబిరం



చిలుకూరు మండలం బేతవోలులో వేసవి శిబిరం ప్రారంభిస్తున్న ఎంఈఓ గురవయ్య

- 10 నుంచి 24వ తేదీ వరకు నిర్వహణ
- జిల్లా వ్యాప్తంగా 50 శిబిరాలు
- 5 వేల మంది విద్యార్థుల్లో నైపుణ్యం మెరుగుపర్చేలా శిక్షణ

చిలుకూరు: రాష్ట్ర విద్యాశాఖ ఆదేశానుసారం జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఈ నెల 10వ తేదీ నుంచి 24 వరకు వేసవి శిబిరాలు నిర్వహించేందుకు సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఇప్పటి వరకు కేవలం జిల్లా కేంద్రాలకేపరిమితమైన వేసవి శిబిరాలు నేడు మండల స్థాయిలో ప్రారంభిస్తున్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందాలనే ఉద్దేశంతో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. అంతేకాక సర్కారు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

మండలానికి రెండు చొప్పున..

జిల్లాలో 23 మండలాలు ఉండగా మండలానికి రెండు చొప్పున వేసవి శిబిరాలు ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాశాఖ నిర్ణయించింది. మండలానికి రెండు చొప్పున 46 వేసవి శిబిరాలతో పాటు నాలుగు మండలాల్లో అదనంగా మరొకటి చొప్పున మొత్తం జిల్లాలో 50 వేసవి శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ వేసవి శిబిరాలను ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు లేదా 9 గంటల నుంచి ఒంటి గంట వరకు నిర్వహించాలని ఆదేశించారు. ఒక్కో వేసవి శిబిరంలో 100 మంది చొప్పున మొత్తం 5 వేల మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. వీరికి శిక్షణ సమయంలో స్నాక్స్ అందజేయనున్నారు. ఒక్కో కేంద్రంలో నలుగురు శిక్షకుల సాయంతో కనీసం నాలుగు అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. వీరికి రూ. 3 వేల గౌరవ వేతనం ఇవ్వనున్నారు.

ప్రవేశం ఇలా..

శిబిరాల్లో ప్రవేశానికి ప్రభుత్వ బడుల్లో చదివిన విద్యార్థులకు తొలి ప్రాధాన్యం ఇస్తారు. మొదటి రోజు ఆధార్‌కార్డు, పాఠశాల వివరాలతో హాజరైతే ప్రవేశం కల్పిస్తారు. శిక్షకులు, ఇతర అంశాలను దృష్టిలో పెట్టుకొని చదరంగం, క్యారమ్స్, స్కిప్పింగ్, లూడో, వైకుంఠపాళి తదితర ఆటలు, డ్రాయింగ్, పెయింటింగ్ సాధన, కాగితాలతో బొమ్మలు తయారు చేయడం, చిన్న చిన్న సైన్స్ ప్రయోగాలు, కర్ర సాము, యోగా, నృత్యం, సంగీతం, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ బేసిక్స్ తదితర అంశాలు నేర్పనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



తొలిసారిగా గ్రామీణ విద్యార్థులకు ఉపయోగపడేలా మండలాల్లో వేసవి శిబి రాలను ఏర్పాటు చేస్తున్నాము. మండలానికి 2 చొప్పున జిల్లా వ్యాప్తంగా 50 వేసవి శిబిరాలను ఏర్పాటు చేస్తున్నాం. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే అన్ని మండలాల్లో వేసవి శిబిరాలను ప్రారంభించాం.

– అశోక్, జిల్లా విద్యాధికారి, సూర్యాపేట

ప్రయాణికుల ఆదరణ పొందాలి

రామగిరి(నల్లగొండ) : ప్రయాణికుల నుంచి ఆదరణ పొందాలని ఆర్టీసీ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఖుస్రోషా ఖాన్ అన్నారు. బుధవారం నల్లగొండ ఆర్టీసీ డిపోను బుధవారం ఆయన సందర్శించారు. డిపోలో గ్యారేజీ, బస్టాండ్‌ను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ కె.జానిరెడ్డి, డిపో మేనేజర్ శ్రీనాథ్, అసిస్టెంట్ మేనేజర్ హుస్సేన్, ఎంఎఫ్ సునీత, ఎస్ఎం భోనగిరి నరేందర్ ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు గ్రేడింగ్

- పనితీరు ఆధారంగా టీచర్లకు అవార్డులు
- తక్కువ గ్రేడ్ వస్తే మళ్లీ శిక్షణ
- మెరుగైన సేవలు అందించే దిశగా ప్రణాళిక



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు (ఫైల్)

హుజూర్‌నగర్ : ప్రభుత్వం మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పలు రకాల సంస్కరణలు తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రేడింగ్ విధానాన్ని అమలు చేసేందుకు ఆ శాఖ కార్యాచరణ రూపొందించింది. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మెరుగైన సేవలు అందించే దిశగా రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రాష్ట్ర మహిళా శిశు సంక్షేమశాఖ ఉన్నతాధికారులతో ఆ శాఖ మంత్రి సీతక్క ఇటీవల నిర్వహించిన ఓ సమావేశంలో ఈ అంశంపై మాట్లాడారు. గ్రేడింగ్ ఆధారంగా అంగన్‌వాడీ కేంద్రాలకు అవార్డులు ప్రకటిస్తామని ఆమె వెల్లడించారు. ఈనేపథ్యంలో ప్రభుత్వం ఇప్పటికే చిన్నారులకు పౌష్టికాహారం, పోషణ లోపం ఉన్న వారికి బాలామృతం ప్లస్‌తో పాటు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్న విషయం తెలిసిందే.

జిల్లా వ్యాప్తంగా 1,209 అంగన్‌వాడీ కేంద్రాలు

జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 1,209 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో గర్భిణులు 4,670 మంది, బాలింతలు 5,448 మంది ఉన్నారు. మూడేళ్ల లోపు చిన్నారులు 25,139 మంది ఉండగా మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లలు 14,819 మంది ఉన్నారు. వీరందరికీ ఆయా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పలు రకాల సేవలు అందుతున్నాయి. ప్రభుత్వం తాజాగా గ్రేడింగ్ విధానాన్ని అమలు చేస్తే ఆయా కేంద్రాలు ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ అయ్యేందుకు అవకాశం ఉంటుందని పలువురు భావిస్తున్నారు.

టీచర్ల పనితనానికి గుర్తింపుగా..

అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు, లబ్ధిదారులకు అందుతున్న సేవలు, టీచర్ల పనితనానికి గ్రేడింగ్ ఇచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. టీచర్లకు ఉన్న బోధనా సామర్థ్యంపై అవగాహన ఆధారంగా గ్రేడింగ్ ప్రకటిస్తారు. ఏ ప్లస్, ఏ, బీ, సీ, కేటగిరీలుగా గ్రేడింగ్ కేటాయించనున్నట్లు తెలుస్తోంది. వచ్చిన గ్రేడ్‌ల ఆధారంగా అవార్డులు ఇవ్వనున్నట్లు సమాచారం. తక్కువ గ్రేడ్లు పొందిన టీచర్లకు ప్రత్యేక శిక్షణ ద్వారా వారి పనితీరును మెరుగుపర్చాలని ప్రభుత్వ భావిస్తోంది.

సేవలు ఆన్‌లైన్‌లో నమోదు

అంగన్‌వాడీ కేంద్రాలు అందిస్తున్న సేవలను రోజువారీగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. గతంలో మాదిరిగా కాకుండా చిన్నారులు, హాజరు, వారికి పంపిణీ చేస్తున్న పౌష్టికాహారం, గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేసిన కోడిగుడ్లు, ఆహారం, తదితర వాటిని ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. కేంద్రానికి ఎంతమంది చిన్నారులు హాజరవుతున్నారో చూసి టీచర్ వారితో ఫొటోలు దిగి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

ఉత్తర్వులు రావాల్సి ఉంది



అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రేడింగ్ విధానం అమలు చేస్తే బాగానే ఉంటుంది. అయితే దానికి సంబంధించి ప్రభుత్వం నుంచి అధికారిక ఉత్తర్వులు రావాల్సి ఉంది. ఉత్తర్వులు వచ్చిన వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.

– నర్సింహారావు, జిల్లా సంక్షేమ అధికారి, సూర్యాపేట

ఏఎమ్మార్పీ కాల్వ భూములు కబ్జా

- కాల్వల వెంట దారులనూ వదలని వైనం
- 300 ఎకరాల భూమి ఆక్రమణలోనే..
- ఆక్రమణదారులపై చర్యలు శూన్యం

గుర్రంపోడు: ఏఎమ్మార్పీ కాల్వల వెంట గల విలువైన ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయి. గుర్రంపోడు మండలం తానేదార్‌పల్లి శివారులోని సర్వే నంబర్ 17లోని ప్రధాన కాల్వ పక్కన గల 12 ఎకరాల ఖాళీ స్థలంపై అక్రమార్కుల కన్నుపడింది. దీంతో ఇటీవల భారీ యంత్రాలతో చదును చేస్తుండగా సంబంధిత అధికారులు వెళ్లి అడ్డుకోవడంతో ఆ ప్రయత్నం ఆగిపోయింది. ఈ స్థలాన్ని గతంలో సబ్ మార్కెట్ యార్డు కోసం రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. ఈ భూమి తనదేనని చదును చేస్తున్న హైదరాబాద్‌కు చెందిన రియల్టర్‌కు హక్కు పత్రాలు చూపించాలని అధికారులు అనడంతో అక్కడి నుంచి జారుకుని మళ్లీ రాలేదు. ప్రస్తుతం వానాకాలం పంటల సాగుకు భూములను సిద్ధం చేసుకుంటున్న రైతులు కాల్వ అంచులకు దగ్గరగా దారి లేకుండా కూడ దున్నేసుకుంటున్నారు. డీప్ కటింగ్ జరిగిన చోట గతంతో గుట్టలుగా ఉన్న మట్టికుప్పలు క్రమంగా మాయమవుతున్నాయి. ఏఎమ్మార్పీలో సిబ్బంది కొరత ఆక్రమణదారులకు అవకాశంగా మారడంగా ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు ఆక్రమించుకుంటున్నారు. ఫిర్యాదులు అందినా భూముల రక్షణకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులపై రాజకీయ ఒత్తిళ్లతో చోద్యంగా చూస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

కాల్వ దారులూ ఆక్రమణే..

మండల పరిధిలో డీ–17 నుంచి డీ–26 వరకు 35 కిలోమీటర్ల ప్రధాన కాల్వ, 250 కిలోమీటర్ల దూరం మేజర్, మైనర్ కాల్వలు ఉన్నాయి. ప్రధాన కాల్వ వెంట ఇరువైపులా వంద ఫీట్లు, మేజర్, మైనర్ కాల్వల వెంట ఎడమవైపు 27 ఫీట్లు, కుడివైపు 15 ఫీట్లు స్థలం రహదారుల కొరకు సేకరించారు. ఇన్స్‌పెక్షన్ పాత్‌లుగా వీటిని కాల్వల వెంట అధికారుల పర్యవేక్షణకు వీటిని వినియోగించేందుకు నిర్దేశించారు. కాల్వలు తవ్వే సమయంలో డీప్ కటింగ్ జరపాల్సిన చోట్ల మట్టిపోసేందుకు ఎక్కువ విస్తీర్ణంలో అక్కడక్కడా భూసేకరణ జరిగింది. కాల్వ దారులను పక్క రైతులు ఆక్రమించుకుంటుండడంతో దారులు కుచించుకునిపోతున్నాయి. మేజర్, మైనర్ కాల్వల వెంట దారి ఆక్రమణల ఫలితంగా కాల్వల వెంట ప్రారంభంలో గల రైతులకు చివరన గల రైతులకు మధ్య దారి విషయమై వివాదాలు జరుగుతున్నాయి. చాలచోట్ల కాల్వ దారులు ఒకవైపు మాత్రమే మిగిలి మరోవైపు పూర్తిగా ఆక్రమణలకు గురయ్యాయి. గుర్రంపోడు డివిజన్ పరిధిలో 2,200 ఎకరాల్లో ఏఎమ్మార్పీ కాల్వలకు భూ సేకరణ జరగ్గా కాల్వలు పోగా సుమారు 300 ఎకరాలు కబ్జాలోనే ఉన్నట్లు తెలుస్తోంది.



తానేదార్‌పల్లి వద్ద ఏఎమ్మార్పీ స్థల ఆక్రమణను అడ్డుకుంటున్న రెవెన్యూ అధికారులు (ఫైల్)



నడికూడ గ్రామంలో ఆక్రమణకు గురైన డీ-22 కాల్వ వెంట దారి

కాల్వల వెంట మొక్కలు నాటాలనుకున్నా..

పర్యావరణతోపాటు కాల్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా రక్షణ ఉంటుందని భావించిన అధికారులు రెండేళ్ల క్రితం హరితహారంలో భాగంగా కాల్వల వెంట మొక్కలు నాటేందుకు ప్రణాళిక రూపొందించారు. అయితే ఆక్రమణలు తొలగించే విషయంలో రైతుల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురు కావడంతో ఎక్కడా మొక్కలు నాటలేదు. హద్దురాళ్లు ఏర్పాటు చేస్తే కాల్వ భూములకు రక్షణ ఉంటుందని అధికారులు ప్రభుత్వానికి నివేదించినా నిధుల కొరతతో అనుమతి లభించడం లేదు. పైగా ఆక్రమణలపై పోలీసులకు ఫిర్యాదు చేసిన సందర్భంగా రాజకీయ నాయకుల నుంచి తమపై తీవ్ర ఒత్తిళ్లు రావడంతో ఫిర్యాదులు వాపసు తీసుకునే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఏఎమ్మార్పీ అధికారులు అంటున్నారు. తమకు జ్యుడీషియల్ అధికారాలు ఇవ్వాలని అప్పుడే ప్రభుత్వ ఆస్తులను కాపాడటానికి తమకు పూర్తి అధికారం ఉంటుందని ఇంజనీరింగ్ అధికారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

హద్దులు ఏర్పాటు చేయాలి



నడికూడ గ్రామంలో డీ–22 కాల్వకు ఇరువైపులా అంచు వరకు రైతులు దున్నేసుకుంటున్నారు. దీంతో కాల్వదారులు కుచించుకుపోయి వివాదాలు జరుగుతున్నాయి. కాల్వ దారుల వెంట హద్దులు ఏర్పాటు చేయాలి.

– వద్దగోని యాదగిరిగౌడ్, రైతు, నడికూడ

కాల్వ దారులను ఆక్రమించొద్దు

ఏఎమ్మార్పీ కాల్వల వెంట గల నీటిపారుదల శాఖ భూములపై రైతులకు ఎలాంటి హక్కులు ఉండవు. కాల్వ రహదారులను ఆక్రమించుకుని దున్నేయడం వల్ల కింది రైతులకు ఇబ్బందులు ఎదురవుతాయి. తానేదార్‌పల్లిలోని నీటిపారుదల శాఖకు చెందిన 12 ఎకరాల స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం.

– నెహ్రూనాయక్, డివిజన్ ఈఈ

ఉగ్రవాద స్థావరాలపై దాడులకు సంపూర్ణ మద్దతు

- నల్లగొండ ఎంపీ రఘువీర్‌రెడ్డి

మిర్యాలగూడ: దేశ రక్షణ, సమైక్యత, సమగ్రత కోసం కేంద్రం పాకిస్తాన్ ఉగ్రవాద స్థావరాలపై చేపడుతున్న దాడులకు భారత పౌరుడిగా సంపూర్ణ మద్దతు తెలుపుతున్నానని నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి అన్నారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పహల్గామ్ ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు అమరులయ్యారని, దీనికి జవాబుగా కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ సింధూర్ చేపట్టి పాకిస్తాన్‌లోని సుమారు 9 ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసి ధ్వంసం చేయడం హర్షణీయమన్నారు. ఆపరేషన్ విజయవంతం కావడంతో యుద్ధం వస్తే సైన్యం దీటుగా సమాధానం ఇస్తుందన్న ధైర్యం ప్రజల్లో కలిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 1971లో ఇందిరాగాంధీ ప్రధానిగా తూర్పు పాకిస్తాన్‌ను స్వాధీనం చేసుకున్నామని, బంగ్లాదేశ్ ఏర్పాటుకు సహకరించామని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్ అన్నారు. ఆపరేషన్ సింధూర్ వల్ల విచ్ఛిన్నకర శక్తులకు బుద్ధి చెప్పినట్లయిందని అన్నారు. సమావేశంలో మిర్యాలగూడ, అంబర్‌పేట ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్), ఆలేరు వెంకటేశం, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పగిడి రామలింగయ్య, పట్టణ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి, గాయం ఉపేందర్‌రెడ్డి, ముజ్జు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ రఘువీర్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే బీఎల్ఆర్, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

చింతపల్లిలో పట్టపగలే రెండిళ్లలో చోరీ



చోరీ జరిగిన ఇంట్లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

చింతపల్లి: దొంగలు పట్టపగలే రెచ్చిపోయారు. తాళాలు వేసి ఉన్న రెండు ఇళ్లలో చోరీకి పాల్పడి నగదుతోపాటు బంగారు ఆభరణాలను దోచుకెళ్లిన ఘటన బుధవారం చింతపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం చింతపల్లికి చెందిన కుక్కుడాల వెంకన్న దంపతులు ఇంటికి తాళాలు వేసి పనికి వెళ్లారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళాలను పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువా తాళాలు కూడా పగులగొట్టి అందులో ఉన్న నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలతోపాటు కొంత నగదును దోచుకెళ్లారు. మధ్యాహ్నం ఒకటి గంటల సమయంలో వెంకన్న అత్తగారు భారతమ్మ ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు బీరువా తాళాలు పగలగొట్టి ఉండడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించింది. కుటుంబ సభ్యులు ఇంట్లో చోరీ జరిగిందని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే నాంపల్లి సీఐ రాజు, చింతపల్లి ఎస్ఐ యాదయ్య సంఘటన స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీంతో పరిశీలించి వివరాలను సేకరించారు. వెంకన్న ఇంటి పక్కనే ఉన్న పాల్వాయి నిరంజన్ ఇంట్లో కూడా తాళాలు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో నగదు వెతకగా ఏమి లభ్యం కాకపోవడంతో వెనుతిరిగి వెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ.. ఇద్దరికి తీవ్రగాయాలు

తిరుమలగిరి(తుంగతుర్తి). తిరుమలగిరి మండలం తొండ గ్రామ సమీపంలో తిరుమలగిరి– తొర్రూరర్ జాతీయ రహదారిపై ఎదురెదురుగా వచ్చిన ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరు వ్యక్తులు గాయాలైన సంఘటన బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నాగారం మండలం ఫణిగిరి గ్రామానికి చెందిన లకావత్ సుధాకర్ ద్విచక్ర వాహనంపై తిరుమలగిరి వస్తుండగా తిరుమలగిరి నుంచి వెలిశాల వైపు వెళ్తున్న ఆఖ్యాతండాకు చెందిన గుగులోతు యాకయ్య ద్విచక్ర వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో సుధాకర్ కింద పడడంతో అదే సమయంలో తొర్రూర్ వైపు వెళుతున్న లారీ సుధాకర్ కాళ్లపై నుంచి వెళ్ళింది. సుధాకర్, యాకయ్యలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానిక ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స చేసి, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు.

అడ్లూరు స్టేజీ వద్ద మరొకరికి..

కోదాడరూరల్ : రెండు బైకులు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన కోదాడ మండలం అడ్లూరు స్టేజీ వద్ద బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కోదాడ మండల పరిధిలోని ఎర్రవరం గ్రామానికి చెందిన గోవిందరావు ద్విచక్రవాహనంపై కోదాడకు వచ్చి కిరాణాషాపు సరుకులు కొనుగోలుచేసి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మేళ్లచెర్వు వైపు నుంచి వస్తున్న మరో ద్విచక్రవాహనం ఎదురుగా ఢీకొనడంతో గోవిందరావుకు తీవ్రగాయాలపాలయ్యాడు. అతని పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ఖమ్మం తరలించారు. ఈ సంఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని రూరల్ పోలీసులు తెలిపారు.



గాయపడిన సుధాకర్, యాకయ్య

క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు



భత్ర దైత్రి (ఫైల్)

మోటకొండూర్: మతిస్థిమితం లేని యువకుడు అదృశ్యమైన ఘటనపై బుధవారం మోటకొండూర్ పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. ఎస్ఐ నాగుల ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన పందొమ్మిదేళ్ల యువకుడు భత్ర దైత్రి ఆరునెలల నుంచి మోటకొండూర్ మండలం దిలావర్‌పూర్ గ్రామంలోని మాతృశ్రీ డెయిరీ ఫామ్‌లో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గత నెల ఏప్రిల్ 26న ఎవరికి చెప్పకుండా డెయిరీ ఫామ్ నుంచి వెళ్లిపోయాడు. ఇంత వరకు అతని ఆచూకీ లభించకపోవడంతో దైత్రి తండ్రి భత్ర మధు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉపేందర్ తెలిపారు. కాగా, డెయిరీ నుంచి బయటకు వెళ్లినప్పుడు, నల్లటి ప్యాంటు, చొక్కా ధరించి ఉన్నాడని, ఎత్తు 5.9 అడుగులు, గోధుమ రంగులో ఉంటాడని, హిందీ, ఒడిశా భాషలు మాత్రమే వస్తాయని పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్ స్టేషన్ నంబర్‌ను 8712662808 సంప్రదించాలని పేర్కొన్నారు.

చోరీ కేసులో ఒకరికి ఏడాది జైలుశిక్ష

కట్టంగూర్ : బంగారం, వెండి నగలు దొంగతనం చేసిన కేసులో ఓ వ్యక్తికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.2 వేలు జరిమానా విధిస్తూ నకిరేకల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ షేక్ ఆరిఫ్ బుధవారం తీర్పు వెల్లడించారు. ఎస్ఐ మునుగోటి రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామానికి చెందిన పులిజాల నర్సింహ తన ఇంటికి తాళం వేసి భార్యతో కలిసి గతేడాది అక్టోబర్ 30న అదే గ్రామంలో కూలి పనులకు వెళ్లాడు. అదేరోజు గుర్తు తెలియని వ్యక్తులు మధ్యాహ్నం సమయంలో నర్సింహం ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లోని బీరువాలో ఉన్న నాలుగు తులాల బంగారు, వెండి ఆభరణాలను దొంగలించారు. దీంతో నర్సింహ ఫిర్యాదు చేయగా అప్పటి హెడ్ కానిస్టేబుల్ బోడ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు అయిటిపాముల గ్రామానికి చెందిన నకిరేకంటి సైదులును పట్టుకొని విచారించగా తానే దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు పంపగా మెజిస్ట్రేట్ ఆరిఫ్ ఏడాది జైలుశిక్షతో పాటు రూ.2వేలు జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

అధ్యయనోత్సవాలు ప్రారంభం



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో ఈనెల 10నుంచి 15 వరకు జరగనున్న తిరుకళ్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం అధ్యయనోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అర్చకులు వేద పారాయణాలు పఠించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ సిరికొండ నవీన్‌కుమార్, అర్చకులు తూమాటి శ్రీనివాసాచార్యులు, చివలూరి పద్మనాభాచార్యులు, కుమ్మరికుంట్ల బదరీనారాయణాచార్యులు, మార్తి లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు, వంశీకృష్ణమాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శేషగిరిరావు, చీకూరిరాజేష్ భక్తులు పాల్గొన్నారు.

ఆంధ్రా నుంచి ధాన్యం రవాణాను అడ్డుకుంటాం

మఠంపల్లి: ఆంధ్రా ప్రాంతం నుంచి ధాన్యం అక్రమ రవాణా జరుగకుండా అడ్డుకుంటామని, ఇందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు హుజూర్‌నగర్ సీఐ గజ్జె చరమందరాజు తెలిపారు. బుధవారం ఆయన మఠంపల్లి మండలం మట్టపల్లి వద్ద కృష్ణా నదిపై గల హైలెవల్ వంతెనపై ఏర్పాటు చేసిన అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టును తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సన్నధాన్యానికి తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న బోనస్‌ను కాజేసేందుకు ఆంధ్రా ప్రాంతం నుంచి దళారులు అక్రమంగా లారీల్లో ధాన్యం రవాణాకు పాల్పడుతున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే ఆంధ్రా–తెలంగాణ సరిహద్దు ప్రాంతాలైన వాడపల్లి, నాగార్జునసాగర్‌లో అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టులు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఆయన వెంట మఠంపల్లి ఎస్ఐ పి.బాబు, పోలీసులు ఉన్నారు.



మట్టపల్లి చెక్ పోస్టు వద్ద రికార్డులు పరిశీలిస్తున్న సీఐ చరమందరాజు

9న ఉమ్మడి జిల్లాస్థాయి నెట్‌బాల్ ఎంపిక పోటీలు

నాగార్జునసాగర్: ఈ నెల 9వ తేదీన నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో ఉమ్మడి జిల్లా స్థాయి నెట్‌బాల్ సబ్ జూనియర్ అండర్–16 బాలబాలికల ఎంపికకు పోటీలు నిర్వహిస్తున్నట్లు నెట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి నల్లగొండ జిల్లా జనరల్ సెక్రటరీ జె.కిరణ్‌కుమార్ బుధవారం తెలిపారు. 31–05–2009 తరువాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. సెలక్షన్‌లకు వచ్చే క్రీడాకారులు ఆధార్ కార్డు జిరాక్స్, పాస్‌ఫొటోలు తీసుకుని రావాలని సూచించారు. ఈ ఎంపిక పోటీలు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు 9160494743 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని కోరారు. పేర్కొన్నారు.

డబుల్ రిజిస్ట్రేషన్లపై వెంచర్ నిర్వాహకులకు జైలుశిక్ష

చౌటుప్పల్ : ఒకరికి విక్రయించిన ప్లాట్లను మరొకరికి విక్రయించడమే కాకుండా వారికి డబుల్ రిజిస్ట్రేషన్ చేసిన వెంచర్ నిర్వాహకులకు ఏడాది జైలు శిక్షతోపాటు జరిమానా విధిస్తూ చౌటుప్పల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి మహతీవైష్ణవి బుధవారం తీర్పునిచ్చారు. చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం ..హైదరాబాద్‌కు చెందిన పెంటం యాదగిరి, ఉప్పలపాటి రాజేంద్రప్రసాద్‌లు చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ శివారులోని గణేష్ మిలీనియం సిటీ వెంచర్‌కు డైరెక్టర్లుగా ఉన్నారు. వీరి వెంచర్‌లో వరంగల్‌కు చెందిన రమణి, లింగారావులకు ఇరువురికి 250 చదరపు గజాల చొప్పున రెండు ప్లాట్లను 2006లో విక్రయించారు. దాంతో వారు ఆయా ప్లాట్లకు ఫెన్సింగ్ వేసుకున్నారు. అయితే అవే ప్లాట్లను 2013లో దోటి శంకరయ్య, వల్లపు శ్రీకాంత్‌లకు మరోసారి విక్రయించారు. వెంటనే వారు తమ ప్లాట్ల వద్దకు వెళ్లి మొదటిసారి కొనుగోలుదారులు వేసుకున్న ఫెన్సింగ్‌ను తొలగించి వీరు నూతనంగా హద్దులు వేసుకున్నారు. దీన్ని గమనించిన వరంగల్‌కు చెందిన బాధితులు ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు విచారణ నిర్వహించగా పీపీ ఖాజానిజాముద్దీన్ వాదనలు వినిపించారు. విచారణలో వెంచర్ డైరెక్టర్లు ప్లాట్లను రెండు పర్యాయాలు విక్రయించి డబుల్ రిజిస్ట్రేషన్ చేసింది వాస్తవమేనని తేలింది. దీంతో నిందితులకు ఇద్దరికి ఏడాది జైలుశిక్షతోపాటు రూ.5వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరోజు జైలు

సూర్యాపేటటౌన్ : సూర్యాపేటలో పట్టణ ట్రాఫిక్ పోలీసులు జరిపిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ఆరుగురు పట్టుబడ్డారు. వీరిని బుధవారం కోర్టులో హాజరు పరచగా ఒకరికి ఒకరోజు జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా, అలాగే మద్యం సేవించి వాహనాలు నడిపిన మిగతా ఐదుగురికి కలిపి రూ.5వేల జరిమానా విధిస్తూ సూర్యాపేట ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి బీవీ.రమణ తీర్పు చెప్పినట్లు పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం తెలిపారు.

వృద్ధురాలి హత్య కేసులో ఒకరికి రెండు శిక్షలు

- నిందితుడికి ఏక కాలంలో రెండు యావజ్జీవ జైలు శిక్షలు అమలు
- సూర్యాపేట జిల్లా ప్రధాన జడ్జి తీర్పు

చివ్వెంల(సూర్యాపేట) : వృద్ధురాలిపై అత్యాచారం చేసి, హత్య చేసిన ఘటనలో వ్యక్తికి జీవిత ఖైదుతో పాటు, మరో 5 సంవత్సరాలు అదనంగా జైలుశిక్ష, రూ.25 వేల జరిమానా విధిస్తూ సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి, ఇన్‌చార్జి మొదటి అదనపు న్యాయమూర్తి పి.లక్ష్మీశారద బుధవారం తీర్పు వెల్లడించారు. వివరాల ప్రకారం.. ఆత్మకూర్ (ఎస్) మండలం ఇస్తాళ్లాపురం గ్రామానికి చెందిన నిమ్మల ఉమాదేవికి పెన్‌పహాడ్ మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తితో వివాహం జరిగింది. కాగా వీరికి ఒక కుమార్తె ఉంది. భార్యభర్తల మధ్య మనస్పర్థల వల్ల 40ఏళ్ల క్రితం భర్తతో విడాకులు తీసుకుని ఇస్తాళ్లాపురంలో కూతురితో కలిసి ఉంటోంది. 20 ఏళ్ల క్రితం కుమార్తె అనారోగ్యంతో మృతి చెందగా ఉమాదేవి ఒంటరిగా ఉంటోంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన కప్పల విజయ్ సూర్యాపేటలోని శ్రీదేవి బార్‌లో వర్కర్‌గా పనిచేస్తూ రోజూ ఇస్తాళ్లాపురం నుంచి వెళ్లి వస్తున్నాడు. ఈ క్రమంలో అదే బజార్‌లో నివాసం ఉంటున్న ఉమాదేవితో పరిచయం పెంచుకుని మందలిస్తూ ఉండేవాడు. విజయ్‌కి 2019లో చివ్వెంల మండల కుడకుడకు చెందిన యువతితో వివాహమైంది. ఇద్దరి మధ్య మనస్పర్థలతో విజయ్ భార్య ఆమె తల్లిగారి గ్రామానికి వెళ్లి ఉంటోంది. విజయ్ కొత్తబైక్ కొనుగోలు చేయాలనుకుని డబ్బులు లేకపోవడంతో ఉమాదేవి ఇంట్లో చోరీకి ప్లాన్ వేశాడు. 2023 ఏప్రిల్ 7 రాత్రి 12 గంటల సమయంలో బార్‌లో పని ముగించుకుని గ్రామానికి వచ్చాడు. అదేరోజు గ్రామంలో ప్రదర్శించిన బలగం సినిమా చూడటానికి వచ్చిన అదే మండలం బోరింగ్ తండాకు చెందిన గుగులోతు ఖలేందర్ ఇస్తాళ్లాపురంలో డిష్ లింగయ్య ఇంటి ముందు అరుగుపై పడుకుని ఉన్నాడు. అతన్ని లేపి తన వెంట తీసుకెళ్లి ఇక్కడ కాపాల ఉండమని ఉమాదేవి ఇంటికి వెళ్లి ఆమె తలుపు కొట్టడండంతో ఆమె లేచి ఎవరు అని అడుగగా, తాను విజయ్‌ని అని తలుపు తీయమనడంతో ఈ సమయంలో ఏం పనినీకు అని ఆమె అరవడం ఒక్కసారిగా తలుపును తన్నాడు. దీంతో తలుపు తెరుచుంది. అనంతరం ఇంట్లోకి వెళ్లి ఉమాదేవి కణత, మూతిపై గుద్దాడడంతో ఆమె మంచంలో పడిపోయి అరుస్తుండగా, దిండులోంచి దూది తీసి ఆమె నోట్లో కుక్కాడు. దీంతో ఆమె స్పృహ కోల్పోవడంతో ఆమెపై అత్యాచారం చేసి, దానిని సెల్‌ఫోన్‌లో చిత్రీకరించాడు. దీంతో ఆమె చనిపోవడంతో అక్కడే ఉన్న సూట్ కేసును తెరిచి అందులో ఉన్న బంగారం, నగదు అపహరించుకెళ్లాడు. తెల్లవారుజామున ఉమాదేవిని ఎవరో చంపారని ఆమె ఇంటి ముందు జనం గూమిగూడడం గమనించి భయంతో సూర్యాపేట వెళ్లాడు. అపహరించిన బంగారాన్ని ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టి రూ.1.90 లక్షలు తీసుకున్నాడు. అడ్వాన్స్‌గా రూ.48 వేలు చెల్లించాడు. అదనపు ఫిట్టింగ్‌కు రూ.10 వేలు ఇచ్చి పల్సర్ బైక్ కొన్నాడు. అదే బైక్‌పై రాత్రి గ్రామానికి వచ్చి తెల్లవారుజామున సూర్యాపేటకు బయలు దేరుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతురాలి సోదరుడు ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ రామ్ నారాయణ్ సింగ్ కేసు నమోదు చేసి నిందితున్ని రిమాండ్‌కు తరలించారు. సాక్షులను విచారించిన న్యాయమూర్తి పీపీ నాతి సవీందర్ కుమార్ వాదనలతో ఏకీభవిస్తూ నిందితుని సెక్షన్ –376 అత్యాచారం కింద జీవిత ఖైదు రూ.10 వేల జరిమానా, సెక్షన్–302హత్య చేసినందుకు జీవిత ఖైదుతోపాటు రూ.10వేల జరిమానా, సెక్షన్ –388 బంగారం, నగదు అపహరించినందుకు ఐదేళ్ల జైలు, రూ.5వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. పీపీకి లైజన్ ఆఫీసర్ గంపల శ్రీకాంత్, కోర్టు కానిస్టేబుల్ వెంకట్ సహకరించారు.

కుంటలో పడి పశువుల కాపరి మృతి



మహేష్ (ఫైల్)

అర్వపల్లి: పశువులకు నీళ్లు తాపేందుకు కుంటలోకి దిగి ప్రమాదవశాత్తు బురదలో దిగబడి పశువుల కాపరి మృతి చెందాడు. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జాజిరెడ్డిగూడెం మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన జూలూరి పున్నయ్య–అండమ్మల కుమారుడు మహేష్ (27) మంగళవారం తమ పశువులను మేత కోసం గ్రామ శివారులోని రేగుల కుంట వద్దకు తోలుకెళ్లాడు. పశువులకు నీళ్లు తాపడానికి రేగులకుంటకు తోలాడు. అయితే కుంటలోంచి పశువులను బయటకు తోలుతున్న క్రమంలో అందులోకి దిగాడు. ఈ క్రమంలోనే మహేష్ కుంటలోని బురదగుంటలో పడి అందులో కూరుకుపోయాడు. అయితే సాయంత్రమైనా మహేష్ పశువులను తోలుకొని ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు కుంట వద్దకు వచ్చి వెతికారు. అప్పటికే చీకటి పడడంతో కనిపించలేదు. బుధవారం ఉదయం మళ్లీ పోలీసులతో కలిసి కుంట వద్దకు వెళ్లి వెతకగా ఈ కుంట సమీపాన చెప్పులు, దుడ్డుకర్ర, టిఫిన్ బాక్స్ పడి ఉండగా వాటి ఆధారంగా ఆ ప్రదేశంలోని చెరువులో వెతకగా అప్పటికే మహేష్ మృతి చెందాడు. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం కోసం తుంగతుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు మహేష్ అవివాహితుడు. కాగా తమ కుమారుడు అకాల మరణం చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరై విలపిస్తున్నారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ సీహెచ్.బాలకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

సూర్యాపేటటౌన్ : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి తర్వాత జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పిల్లలమర్రి గ్రామానికి చెందిన లంజపల్లి సైదులు(25) జిల్లా కేంద్రంలో ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. మంగళవారం రోజు మాదిరిగానే డ్యూటీ ముగించుకొని ఇంటికి వెళ్లేందుకు పట్టణానికి చెందిన అతని స్నేహితుడు వేణు అనే వ్యక్తిని తనను ఇంటి వద్ద దింపి రావాలని కోరడంతో అతని బైక్ వేసుకొని పిల్లలమర్రి గ్రామానికి వెళ్తుండగా జాతీయ రహదారిపై హెచ్ఎఫ్‌సీ హోటల్ ఎదురుగా విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఇన్నోవా కారు అతివేగంతో వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సైదులు తీవ్ర గాయాలై అక్కడిక్కడే మృతి చెందగా వెనకాల కూర్చున్న వేణుకు తీవ్ర గాయాలయ్యాయి. మృతుడు సైదులు తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ సీఐ వీరరాఘవులు తెలిపారు.

ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ ఘటనలో మరొకరు మృతి


- నాలుగుకు చేరిన మృతుల సంఖ్య



శ్రీకాంత్ (ఫైల్)

మోటకొండూర్: మండలంలోని కాటేపల్లి గ్రామంలోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీలో ఏప్రిల్ 29న రియాక్టర్ పేలిన సంఘటనలో గాయపడిన కార్మికుల్లో మరొకరు మృతి చెందాడు. దీంతో మృతుల సంఖ్య నలుగురికి చేరింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన బర్ల శ్రీకాంత్(35) యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం 4గంటల సమయంలో మృతి చెందినట్లు ఎస్ఐ నాగుల ఉపేందర్ తెలిపారు. మరో ఐదుగురు యశోదలో చికిత్స పొందుతున్నారు. శ్రీకాంత్ సొంత గ్రామం యాదగిరిగుట్ట మండలం కాచారం కాగా శ్రీకాంత్ ఆలేరులో నివాసం ఉంటూ కంపెనీకి వచ్చేవాడు. శ్రీకాంత్ తండ్రి సిద్దిరాములు పెద్దకందుకూర్‌లోని ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్‌లో పర్మినెంట్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. దీంతో ఆయన ఇద్దరు కుమారులను పెద్దకందుకూర్‌లోని కంపెనీలో ఉద్యోగంలో చేర్పించాడు. అనంతరం కాటేపల్లిలోని ప్రీమియర్ కంపెనీలో ప్రొడక్షన్ పనులు ప్రారంభం కావటంతో బదిలీపై ఇక్కడికి వచ్చారు. బీఎస్సీ కెమిస్ట్రీ చదివిన శ్రీకాంత్ మూడేళ్లుగా సీనియర్ ప్రొడక్షన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా మృతుడి శ్రీకాంత్‌కు పదకొండేళ్లలోపు ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. శ్రీకాంత్ మృతితో ఆయన కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగారు.

మామిడి, కొబ్బరి, టేకు చెట్లు దగ్ధం



రామాపురం వద్ద దగ్ధమైన చెట్లు

నడిగూడెం : మండలంలోని రామాపురంలో గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం వరికొయ్యలకు నిప్పంటించారు. దీంతో ఈదురుగాలులకు మంటలు వ్యాపించి అదే గ్రామానికి చెందిన ఏనుగుల వీరాంజనేయులు, బేతం యేసురెడ్డిలకు చెందిన పది మామిడి, 25 టేకు, పది కొబ్బరి చెట్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. దీంతో ఇద్దరు రైతులు చెరో రూ.50వేల వరకు నష్టపోయారు. అధికారులు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

గోండ్రియాల రేషన్ డీలర్ సస్పెన్షన్

- డీలర్‌తోపాటు మరో ఇద్దరిపై కేసు నమోదు

అనంతగిరి: రేషన్ బియ్యాన్ని అక్రమంగా అమ్ముతున్న అనంతగిరి మండలం గోండ్రియాలలో రేషన్ డీలర్‌ను సివిల్ సప్లయ్ అధికారులు సస్పెండ్ చేశారు. అలాగే డీలర్‌తో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేశారు. అధికారులు తెలిపిన వివరాలు.. అనంతగిరి మండలం గోండ్రియాలలో రేషన్ షాపు–13 నుంచి రేషన్ బియ్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు అనంతగిరి ఆర్ఐ వెంకటనగేష్ బుధవారం గోండ్రియాల శివారులో తనిఖీలు చేపట్టారు. తనిఖీలో ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం బుద్ధారాం తండాకు చెందిన బాణోతు సైదులు 50 కేజీల సన్నబియ్యాన్ని తీసుకెళ్తుతూ పట్టుబడ్డాడు. ఈ మేరకు ఆ వ్యక్తిని విచారణ చేయగా గోండ్రియాలలోని 13వ నంబర్ షాపు డీలర్ లీలాకుమారి, ఆమె భర్త యడ్లపల్లి నరసింహారావు దగ్గర 50 కేజీల రేషన్ బియ్యాన్ని రూ.1,350కు కొనుగోలు చేసినట్లు తెలిపాడు. దీంతో ఆర్ఐ వెంకటనగేష్ ఇచ్చిన సమాచారం మేరకు సివిల్ సప్లయ్ అధికారులు సంయుక్తంగా రేషన్ షాపు13లో తనిఖీలు చేపట్టగా ఉండాల్సిన స్టాక్ కంటే 98 కేజీల రేషన్ బియ్యం అదనంగా ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. రేషన్ డీలర్ లీలాకుమారి, యడ్లపల్లి నర్సింహారావు, బాణోతు సైదులుపై 6ఏ కేసులు నమోదు చేసినట్లు డీటీసీఎస్ మైలా రాంరెడ్డి తెలిపారు. అదేవిధంగా డీలర్‌ను సస్పెండ్ చేసి రేషన్ షాపు బాధ్యతలను మరో డీలర్‌కు అప్పగించారు. అనంతగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్టేషన్‌లో సదరు వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు ఏఎస్ఐ లింగారెడ్డి తెలిపారు. తనిఖీలో సివిల్ సప్లయ్ బండి కృష్ణారెడ్డి ఉన్నారు.